కిక్కెవరికో..? లక్కెవరికో?!

ఈనాడు, కడప



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో ఒక్క మద్యం దుకాణం దక్కినా చాలనే భావనతో మద్యం టెండర్ల దరఖాస్తులకు క్యూ కడుతున్నారు. ఈ అవకాశం దక్కించుకోవడానికి రాజకీయ నాయకుల నుంచి దళారుల వరకు ఎత్తుకుపైఎత్తులు వేస్తూ లాటరీ విధానం కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు దాఖలుకు 11వ తేదీ వరకు గడువు పెంచారు. వ్యాపార వాంఛ, రాజకీయ కాంక్షల మధ్యవర్తులు రాయబారాలు జరుపుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి.

● జిల్లాలో 139 దుకాణాలకు మంగళవారం రాత్రి వరకు 1,800 దరఖాస్తులు వచ్చాయి. కొన్ని చోట్ల దరఖాస్తులు వేయనీయకుండా కొందరు నేతలు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్నమయ్య జిల్లాతో పోల్చితే జిల్లాలో అక్రమాలు, అంతర్గతంగా దౌర్జన్యాలు జరుగుతున్నాయి. ఈ నెల 14న మద్యం దుకాణాలను లాటరీ విధానంలో కేటాయించడానికి ఆబ్కారీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది.

దరఖాస్తు చేసుకున్న వారికి ఎంట్రీ పాసులు జారీ చేసి లాటరీ కార్యక్రమానికి అనుమతిస్తారు. కడప నగరం, ఇతర పట్టణ ప్రాంతాల్లో దుకాణాలకు వ్యాపారులు పోటీపడుతున్నారు. కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు ప్రాంతాల దుకాణాలకు ఎక్కువ మంది దరఖాస్తు చేయడానికి పోటీ పడ్డారు. కొన్నిచోట్ల రాజకీయ నేతల బెదిరింపులతో దరఖాస్తులు తక్కువ సంఖ్యలో దాఖలయ్యాయి. లాటరీలో దుకాణం దక్కించుకున్నా... వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామంటూ బెదిరంపులతో కొందరు వెనకడుగు వేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు అవకాశం ఉండడంతో కొందరు ధైర్యంగా గోప్యంగా దరఖాస్తు చేశారు. ఏ దుకాణానికి ఎవరు దాఖలు చేశారనే విషయం తెలుసుకునే విధానం లేకపోవడంతో నేతలు, ఔత్సాహిక వ్యాపారులు ఆసక్తిగా ఇతరుల ద్వారా దరఖాస్తుదారుల గురించి ఆరా తీస్తున్నారు. శుక్రవారం వరకు మరిన్ని దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉంది. అయిదేళ్ల తర్వాత అమల్లోకి వచ్చిన నూతన మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో మద్యం దుకాణం ఒక్కటి తగిలినా చాలు పరపతి పెంచుకోవచ్చనేది చాలా మంది భావన. ఆ అవకాశం దక్కించుకోవడానికి రాజకీయ నేతల నుంచి దిగువ స్థాయి దళారుల వరకు ప్రస్తుతం ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని ఉద్యోగులు సైతం దుకాణాల కోసం పోటీపడుతున్నారు. కొందరైతే మద్యం దుకాణం ఉండడం స్టేటస్‌గా భావిస్తున్నారు. పరిమితి లేకపోవడంతో ఒక్కొక్కరు పదుల సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేస్తున్నారు. ఏదేని ఒకటైనా తగలక పోతుందా.. అనే భావనతో పోటీపడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం మద్యం దుకాణాలపైనే చర్చోపచర్చలు సాగుతున్నాయి. లైసెన్స్ ఫీజు 6 దఫాలుగా చెల్లించుకునే వెసులుబాటు ఉండడంతో పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల దాఖలుకు మరో రెండు రోజులు గడువు పెంచడంతో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కడప ఇన్‌ఛార్జి కమిషనర్‌గా జేసీ


బిల్టప్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా జాయింట కలెక్టర్ అదితిసింగ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో కొత్త కమిషనర్ విధుల్లో చేరే వరకు అదితిసింగ్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించనున్నారు.

ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీగా గిరి

వైవీయూ (కడప): ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీగా డాక్టర్ డి.గిరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నూతన ఆర్జేడీని పలువురు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కలిసి అభినందనలు తెలిపారు.

మహాలక్ష్మీ... నమోస్తుతే!



కడప విజయదుర్గ ఆలయంలో కాత్యాయనిగా


కడప అమ్మవారిశాలలో బాలాత్రిపురసుందరిగా వాసవీమాత


ప్రొద్దుటూరులో గజలక్ష్మీదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరీదేవి


దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం జగన్మాత మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు... జిల్లావ్యాప్తంగా శక్తి స్వరూపిణి ఆలయాల్లో అమ్మవారు ఎర్రటి దుస్తుల్లో తేజోమయ రూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో లక్ష్మీదేవిని పూజిస్తే ఆ తల్లి సర్వ మంగళకారిణిగా భాగ్యరాశులను కురిపిస్తుందని భక్తుల నమ్మిక. పంచభోగాలైన పాయసం, చక్రపొంగలి, లడ్డు, పులిహోర, దద్దోజనాలను అమ్మవారికి నివేదించారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదీప్య రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో చేసిన ప్రత్యేక అలంకారాలు చిత్రాలివి. - న్యూస్‌టుడే, కడప, ప్రొద్దుటూరు బృందం


కడప విజయదుర్గ ఆలయం, అమ్మవారిశాలల్లో దర్శనానికి భక్తుల బారులు


లలిత పంచాయతన ఆలయంలో ధనలక్ష్మిగా


కడప నగరంలో అమ్మవారి వేషధారణలో యువతుల సందడి

ఎదురింట్లో కుర్రాడు... పైగా సొంతూరి వాడే...
కుమారుడు దూరంగా ఉండడంతో అతడినే కుమారుడిలా నమ్మింది
అమ్మలా ప్రేమను పంచింది
అతను కొడుకులా ఉంటూ నమ్మించాడు
ఆకలేసినప్పుడు అన్నం పెట్టింది
అతడు చేతినున్న బంగారు గాజులు చూశాడు
కష్టం వస్తే అయ్యో అని వగచింది
అతను ఆమె మెడలో నగలు చూశాడు
తల్లిలా మమతను పంచితే
అతనిలోని నరరూప రాక్షసుడు బలికోరాడు
ఆమె అనారోగ్యాన్ని బలహీనతగా గుర్తించాడు
మహత్తు ఉన్న స్వామి పేరిట నమ్మించాడు
నరకానికి తీసుకెళ్తున్నాడని తెలియక నమ్మి వెళ్లింది
మత్తు ఇచ్చాడు... సుత్తితో మోది హతమార్చాడు



నిందితుడు వెంకటేష్

- న్యూస్‌టుడే మదనపల్లె నేరవార్తలు.


రోదిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్


పరారీలో ఉన్న అనిల్


అనుమానితురాలు రమాదేవి

నమ్మినవాడే నరరూప రాక్షసుడు!

మదనపల్లె పట్టణంలో సంచలనం సృష్టించిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి హత్యోదంతమిది. బిడ్డలా ఆదరించిన వ్యక్తే నిందితుడని తెలిసి అందరూ నివ్వెరపోవాల్సి వచ్చింది. ఈ ఘటన వెనుక వివరాలివి.

మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి (62) కుమారుడు నాగేంద్రప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐగా పనిచేస్తున్నారు. పట్టణంలో సొంతిల్లు ఉండడంతో తల్లి ఒక్కతే ఇక్కడ ఉంటోంది. వీరిది కలికిరి మండలం మేడికుర్తి. కాగా అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అతని తల్లిదండ్రులు లక్ష్మమ్మ, సురేంద్ర కూడా మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీలోనే నివాసం ఉంటున్నారు. స్వగ్రామం, పరిచయస్థులు కావడంతో వెంకటేష్ కుటుంబంతో ఆమె సన్నిహితంగా ఉంటోంది. తన కుమారుడు దూరంగా ఉండడంతో కొడుకు వయసున్న వెంకటేష్‌తో కావాల్సిన వస్తువులు తెప్పించుకునేది. అతను మాత్రం ఆమె నగలు కాజేయాలని పథకం వేసి తన స్నేహితుడైన నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధికి చెందిన అనిల్‌ను జత కలుపుకొన్నాడు. వీరిద్దరూ హత్యకు కుట్రపన్నారు. ఇందులో భాగంగా గత నెల 28న కాశీ నుంచి ఓ స్వామీజీ వచ్చాడని అతని వద్ద చూపించుకుంటే ఎలాంటి రోగాలైనా మటుమాయం అవుతాయని స్వర్ణకుమారిని నమ్మించారు. వారి మాటలు నమ్మి వెళ్లిన ఆమెకు నిద్రమాత్రలు కలిపి ఉన్న తీర్థాన్ని తాగించారు. ఆమె మత్తులో ఉండగానే సుత్తితో తలపై కొట్టి చంపేశారు. అనంతరం ఆమె వద్ద ఉన్న నగలు తీసుకుని స్థానికంగా ఉన్న ఓ ఫైనాన్స్ సంస్థలో కుదువ పెట్టి రూ.4.30 లక్షలు నగదు తీసుకున్నారు. తిరిగి వచ్చి గోనెసంచిలో ఆమె మృతదేహాన్ని ఉంచి అయోధ్యనగర్‌లోని శ్మశాన వాటికలో ఓ సమాధిని సగం తవ్వి అందులోనే పూడ్చేసి వెళ్లి పోయారు. స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్ర ప్రసాద్ తల్లి కన్పించలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పది రోజుల పాటు ఇటు మదనపల్లె పోలీసులు అటు శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు సంయుక్తంగా విచారణ చేపట్టగా స్వర్ణకుమారితో సన్నిహితంగా మెలిగే వెంకటేషే నిందితుడని నిర్ధారణ అయింది. మంగళవారం అతన్ని అరెస్టు చేసి స్వర్ణకుమారిని పూడ్చిన శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ గోనెసంచితో పూడ్చిన స్వర్ణకుమారి మృతదేహం బయటపడింది. ప్రభుత్వాసుపత్రి వైద్య బృందంతో ఘటనా స్థలంలోనే శవపరీక్ష నిర్వహించి అంత్యక్రియలు చేశారు.


స్వర్ణకుమారి మృతదేహం ఉన్న గోనెసంచి

కుమారుడిని పెంచి... ప్రయోజకుడిని చేసి: స్వర్ణకుమారి భర్త రెండో వివాహం చేసుకోవడంతో అతనితో విభేదించి చిన్నప్పుడే కుమారుడు నాగేంద్రప్రసాద్‌తో మదనపల్లెకు వచ్చి కష్టపడి చదివించారు. అలా కుమారుడు హాకీ క్రీడాకారుడిగా సత్తా చాటి బీటీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. క్రీడల కోటాలోనే ఎస్.ఐగా ఎంపికైన ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎక్కువ కాలం పనిచేసి ప్రస్తుతం సీఐగా ధర్మవరం ఒకటో పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడితో కొన్నాళ్లు ఉండడం, సొంతిల్లు దెబ్బతింటుందని మదనపల్లెకు రావడం చేస్తుండేవారు. ఇంతలోనే నమ్మి ఆదరించిన వాడే నరరూప రాక్షసుడిగా మారి ఆమెను హతమార్చాడు. స్వర్ణకుమారి మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, నాగేంద్రప్రసాద్ స్నేహితులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు హాజరవ్వడంతో విషాదం అలముకుంది. ఇప్పటికి వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనికి సహకరించిన అనిల్ పరారీలో ఉన్నాడు. హత్య జరిగిన రోజు అనిల్ తల్లి కూడా ఇంట్లోనే ఉండటంతో ఆమె కూడా సహకరించిందని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేస్తే నిందితులు ఇంకా ఏమైనా నేరాలు చేశారా? అని తెలిసే అవకాశం ఉంది. పరారీలో ఉన్న నిందితుడు అనిల్ కోసం ఓ బృందం గాలిస్తోందని అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు


సమీక్షిస్తున్న కలెక్టర్ శివశంకర్, పక్కన జేసీ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. విజయవాడ నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం జిల్లా అధికారులతో దృశ్య మాధ్యమంలో సమీక్షించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 206 పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జలవనరుల శాఖ ఎస్ఈలు మల్లికార్జునరెడ్డి, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

14 నుంచి పల్లెపండగ వారోత్సవాలు : ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. అమరావతి నుంచి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా అధికారులతో దృశ్యమాధ్యమ సమీక్ష చేపట్టారు. అనంతరం కలెక్టర్... జిల్లా అధికారులతో మాట్లాడుతూ గ్రామ సభల్లో ప్రతిపాదించిన 983 పనులకు అనుమతి తీసుకున్నామని, వాటి వివరాలను అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రచురించాలని సూచించారు. డ్వామా పీడీ విజయ్‌కుమార్, పీఆర్ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, గనులశాఖ ఆర్ఐ విమలమ్మ, డీపీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్తు తయారీలో ప్రోత్సాహకాలు


మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ, పక్కన ఈఈ, డీఈలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రధాని సూర్యఘర్ యోజనలో భాగంగా ఇళ్లు, భవనాలపై 1 నుంచి 3 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సౌర పలకల ఏర్పాటుతో సంప్రదాయేతర విద్యుత్తు ఉత్పత్తికి ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఈఈ కార్యాలయంలో విద్యుత్తు ఇంజినీర్లు, ఈఆర్వోలతో సమీక్షించాక ఆయన మాట్లాడారు. కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేల రాయితీతో లబ్ధి ఉంటుందన్నారు. బ్యాంకుల్లో స్వల్ప వడ్డీలతో రుణాలకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఈఈ రమణారెడ్డి, డీఈలు శ్రీనివాసులురెడ్డి, శిరీష, ఏఈలు, ఈఆర్వో సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగి బాలుడి మృతి



మైదుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని జంగంపల్లె సమీప గోరేడువంక నీటిలో మునిగి మంగళవారం విశ్వనాథపురం ఎస్సీకాలనీకి చెందిన **కొట్టం సుజిత్** (14) అనే బాలుడు మృతి చెందాడు. మేతకు వెళ్లిన గేదెలను ఇంటికి తోలుకుని వచ్చే ప్రయత్నంలో వంకలోకి వెళ్లడంతో వాటిని బయటకు తోలేందుకు దిగిన బాలుడు నీటిలో మునిగాడు. తండ్రి సుదర్శన్ గేదెల వ్యాపారం చేస్తున్నారు. శెట్టివారిపల్లె ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలుడు దసరా సెలవులు కావడంతో కొద్దిసేపు గేదెల వద్ద కాపలాగా ఉండి ఇంటికి తోలుకుని వచ్చే ప్రయత్నంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. కొట్టం సుదర్శన్, రామ దస్తగిరమ్మ దంపతుల రెండో కుమారుడైన సుజిత్ మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

వేధింపులు తాళలేక నవవధువు బలవన్మరణం



చక్రాయపేట, న్యూస్‌టుడే : భర్త, అత్త వేధింపులు తాళలేక పెళ్లైన ఆరు నెలలకే ఓ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని అద్దాలమర్రిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ నాగరాజు వివరాల మేరకు.. అద్దాలమర్రికి చెందిన **గంగాసుమతి** (19)కి ఆరు నెలల కిందట శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన తోళ్లపల్లె ప్రశాంత్‌తో వివాహమైంది. భర్త ప్రశాంత్‌తో పాటు అత్త కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నారు. ఇటీవల గంగాసుమతి పుట్టింటికి వచ్చారు. అయినా భర్త, అత్త చరవాణిలో వేధించేవారు. దీంతో మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఆన్‌లైన్ క్రీడల్లో నష్టపోయి యువకుడి ఆత్మహత్య



చక్రాయపేట, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ క్రీడలు ఓ యువకుడి ప్రాణాలు బలితీసుకున్న సంఘటన చక్రాయపేట మండలం బీఎన్ తాండాలో మంగళవారం చోటు చేసుకుంది. బీఎన్‌తాండాకు చెందిన **ఇస్లావత్ కార్తీక్‌నాయక్** (19) డిప్లొమా మధ్యలోనే ఆపేసి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఇటీవల ఆన్‌లైన్ క్రీడలకు అలవాటు పడి కొంత నగదు పోగొట్టుకున్నాడు. మూడు రోజుల కిందట బ్యాంకు నుంచి నగదు తీసుకురావాలని తండ్రి అతడిని పంపించాడు. నగదు కోసం వెళ్లిన కార్తీక్‌నాయక్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. కాలేటివాగు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎంత నగదు పోగొట్టుకున్నాడనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.

జైలు డిప్యూటీ పర్యవేక్షణాధికారి ఆకస్మిక బదిలీ

కొత్త అధికారిగా కమలాకర్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప కేంద్రకారాగారంలో డిప్యూటీ పర్యవేక్షణాధికారిగా పని చేస్తున్న జవహర్‌బాబును ఆకస్మికంగా వైజాగ్‌కు బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న కమలాకర్‌ను కడపలో నియమించారు. జవహర్‌బాబు పనితీరుపై పలు ఆరోపణలున్నాయి. ఆయన ఖైదీలను పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారని, వర్గాలుగా విభజించి కొంతమందితో చనువుగా ఉండడం, మరికొంతమందితో దురుసుగా వ్యవహరించేవారని సమాచారం. మే 8న కేంద్ర కారాగారంలో చెట్టు కొమ్మలను తొలగించేందుకు ఓ ఖైదీని పైకి ఎక్కించి అతని మృతికి కారణమయ్యారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పైగా కొంతమంది ఖైదీల బంధువులు జవహర్‌బాబు తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వీటిన్నింటి నేపథ్యంలో బదిలీ జరిగిందని చెబుతున్నారు. దీనిపై జైలు అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ వైజాగ్‌లో ఖైదీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో జవహర్‌బాబును అక్కడికి బదిలీ చేశారని పేర్కొన్నారు.

ఏరువాక... జోరుగా సాగుగాక!



పత్తి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నూతన వంగడాల సాగులో విజయం

అన్నదాతకు అండగా శాస్త్రవేత్తలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: ఆరుతడి పంటలు సాగు చేస్తూ ఏటా నష్టాలు మూటగట్టుకుంటున్న అన్నదాతలకు అత్యుత్తమ ఫలితాలు అందించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. వ్యవసాయ పరిశోధనలే సవాలుగా వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. సాగులో నూతన పద్ధతులు, కొత్త వంగడాలపై ప్రయోగాలు, ఏ పంటలు వేయాలి, ఎలాంటి మందులు వాడాలి, దిగుబడి ఎలా పెంచుకోవాలి, తదితర విజ్ఞానాన్ని రైతులకు చేరవేస్తున్నారు. వారి కృషికి ఎన్నో పురస్కారాలు లభించాయి. వీటన్నింటికి వేదికగా కర్షకులకు అండగా నిలుస్తోంది సీకేదిన్నెలోని ఏరువాక కేంద్రం.

300కు పైగా క్షేత్ర ప్రదర్శనలు

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 300కు పైగా వివిధ పంటల్లో క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించారు. చీడపీడల నివారణ, పంటల యాజమాన్యంలో కొత్త పద్ధతులను రైతులకు పరిచయం చేయడంతో పాటు నూతన వంగడాలు కల్పిస్తున్నారు. వరిలో ఎన్‌డీఎల్‌ఆర్-9, ఎన్‌ఎల్‌ఆర్-15048, 40054, 34449, 3041, 20084, 3083 ఎంసీఎం-105, బీపీటీ-3042, కందిలో ఎల్‌ఆర్‌జీ-41, 105, టీఆర్‌జీ-22, శనగలో ఎన్‌బీఈజీ-776, మినుములో ఎల్‌బీజీ-904, పెసరలో ఎల్‌జీజీ-607, 630, జొన్నలో ఎస్‌టీజే-5, రాగిలో వకుళ, కొర్రలో గరుడ, సూర్యనంది, మహానంది రకాలను రైతులకు పరిచయం చేశారు.

500 శిక్షణ కార్యక్రమాలు

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో 500 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనుబంధ శాఖలతో రైతులకు 250, వ్యవసాయ విస్తరణ అధికారులకు 100 శిక్షణలిచ్చారు. జిల్లాలో పరిశీలన బృందాలతో కలిసి 1,500 పంటలు పరిశీలించారు. తిరుపతి వ్యవసాయ కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ అనుభవ పథకం కింద శిక్షణ అందించారు.

సాంకేతిక పరిజ్ఞానం అందించారు

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పంటల సాగుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కొత్త రకాల విత్తనాలు తమకు ఇచ్చి సాగు చేయించారు. ఏ సమయానికి మందులు వాడాలి, ఎంత ఎరువులు వేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. పెసర పంట సాగు చేయగా ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చి మంచి ఆదాయం పొందాను. యాజమాన్య పద్ధతులు పాటించడంతోనే అధిక దిగుబడి వచ్చింది. **- మాధవరెడ్డి, రైతు, లింగాయపల్లె, వల్లూరు మండలం**

సేంద్రియ పద్ధతిలో సాగు

సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేశాను. ఏరువాక శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు వరి, పత్తి, రాగి, జొన్న, కొర్ర వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులు చేపట్టాను. కొత్త రకాలు కావడంతో శాస్త్రవేత్తల సూచనలతోనే సేంద్రియ ఎరువులు వాడాను. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు తోడుగా నిలుస్తున్నారు. రసాయనిక మందులు వాడడం తగ్గించి సేంద్రియ ఎరువులు వేస్తున్నాను. **- కృష్ణమూర్తి, రైతు, మామిళ్లపల్లె, మైదుకూరు**

లాభసాటిగా మార్చడమే లక్ష్యం

రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ఏరువాక కేంద్రం కృషి చేస్తుంది. జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. రైతులు జాగ్రత్తగా సాగును ఎంచుకోవాలి. వాతావరణానికి అనువైన పంటలనే సాగు చేయాలి. నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి. తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యమివ్వాలి. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించే వరి, పెసర, రాగి, మినుము, కొర్ర తదితర వంగడాలను రైతుల పొలాల్లో సాగు చేయించి వాటి ఫలితాలను విశ్వవిద్యాలయానికి అందిస్తున్నాం. జిల్లాలో మంచి ఫలితాలు వస్తున్నాయి. **- అంకయ్యకుమార్, ఏరువాక కేంద్రం, సమన్వయకర్త**

కస్తూర్బాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 43 బోధనేతర (నాన్‌టీచింగ్) సిబ్బంది పోస్టులను పొరుగు సేవల (ఔట్‌సోర్సింగ్) ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15లోగా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు ఎటువంటి విద్యార్హత లేదని, డే, నైట్ వాచ్ ఉమెన్, చౌకీదార్ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివరాలకు apkgbv.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వైవీయూలో నూతన నియామకాలు చేపట్టాలి

కడప విద్య, న్యూస్‌టుడే: వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) వైస్‌ఛాన్స్‌లర్ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ రాంప్రసాద్‌రెడ్డిలను వెంటనే తొలగించాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్ డిమాండ్‌చేశారు. స్థానిక కాగితాలపెంటలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైవీయూకు రాష్ట్రంలో గౌరవమైన గుర్తింపు ఉందన్నారు. ఈ నియామకాలతో ప్రతిష్ఠ దిగజారుతోందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే, జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు అజ్మతుల్లా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఇసుక సమస్యను పరిష్కరించాలని వినతి

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఇసుక సమృద్ధిగా అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక కుటుంబాలు మొత్తం పస్తులు ఉంటున్న పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణం ఇసుక సమస్యను పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండు చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ ఇసుక ధర అమాంతంగా పెరిగి ట్రాక్టరు రూ. 6 వేలకు పైగా విక్రయిస్తున్నారని, సామాన్య ప్రజలకు పెను భారంగా మారిందని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా కింది స్థాయి అధికారులు వ్యవహరిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకుని భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండు చేశారు.

10న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా అంత్యోదయ దివాస్ సందర్భంగా ఈ నెల 10న వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించనున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.రాజేష్ తెలిపారు. కడపలోని అప్సర కూడలి, బద్వేలు, లక్కిరెడ్డిపల్లె, సుండుపల్లి బస్టాండు ప్రాంతాల్లో, చిట్వేలు పరిధిలోని చక్రంపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఈ నెల 10వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. సవరణలు, కొత్తగా నమోదు, ఫోన్ నంబరు లింక్, పేర్లు, చిరునామా మార్పులు చేసుకోవచ్చని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం



విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న డీఈవో అనురాధ, ఇస్రో ప్రతినిధులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న వరల్డ్ స్పేస్ వీక్-2024 కార్యక్రమం ఉత్సాహంగా సాగుతుంది. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే ఆలోచనా విధానాన్ని పెంపొందించడం, పరిశోధనల వైపు అడుగులేయాలనే లక్ష్యంతో ఇస్రో సహకారంతో స్పేస్ - వెదర్ ఛేంజ్ అనే థీమ్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి విద్యార్థులు హాజరై వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి డీఈవో అనురాధ, నోడల్ అధికారి వి.రమణయ్య, ఇస్రో జనరల్ మేనేజర్ ఎ.బాలమురళి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.రెడ్డయ్యలు ధ్రువపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, వీపీ టీఎన్ ప్రసాద్, వీరశంకర్, సురేష్‌బాబు, కమిటీ మెంబర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



మహావీర్ కూడలిలో వైద్యులు, వైద్య విద్యార్థుల ప్రదర్శన

మారుతీనగర్, న్యూస్‌టుడే: మానసిక ఆరోగ్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలైతే శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయని ప్రత్యేక మానసికవ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు అన్నారు. కడప నగరపాలక కార్యాలయం నుంచి మహావీర్ కూడలి వరకు రిమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ, అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ప్రపంచ మానసిక వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, వంశీకృష్ణ, సునీత, పీజీ, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో జగన్ పోటీ చేస్తే తట్టుకునే శక్తి ఆదికి ఉందా?

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సూటి ప్రశ్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జగన్ జమ్మలమడుగులో పోటీ చేస్తే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తట్టుకోగలరా అని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రాజ్యాంగం అమలు చేస్తామంటే కుదరదని తేల్చి చెప్పారు. మంగళవారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పదవిలో ఉన్న వ్యక్తి నోటికి వచ్చిన విధంగా మాట్లాడడం తగదన్నారు. ఆయన కంటే ఎక్కువగా మాట్లాడగలనని అయితే సంస్కారం అడ్డొస్తోందని చెప్పారు. తానేసిన యార్కర్ బాల్‌ను కొట్టలేక ఎమ్మెల్యే ఏదేదో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బయటకు ఫ్యాషన్ అంటూ లోపల ఫ్యాక్షన్ ఆలోచనలతో ముందుకెళ్తున్నారని అన్నారు. ఈ తాటాకు చప్పుళ్లకు భయపడేవాడిని కాదని ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు. గండికోట ముంపు వాసులకు అదనంగా ఇస్తానన్న పరిహారం, రాజోలి జలాశయం బాధితులకు రూ.24 లక్షలు ఇప్పిస్తే తాను కూడా సంతోష పడతానని చెప్పారు. జగన్ సీఎం కాగానే రాష్ట్రాన్నే వదిలి వెళ్లిపోయిన వ్యక్తి జమ్మలమడుగులో ఆయన పోటీ చేస్తే తట్టుకోలేరని అన్నారు. ఎమ్మెల్యే తమపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు గిరిధర్‌రెడ్డి, ముల్లా జానీ, సింగరయ్య, వేణుగోపాల్, రిషికేశవరెడ్డి, ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం ఘన విజయం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే క్రికెట్ టోర్నీలో భాగంగా కడప వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో తూర్పు గోదావరితో జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 112/2తో బ్యాటింగ్ కొనసాగించిన విశాఖ జట్టు 68 ఓవర్లలో 426/3 పరుగులకు డిక్లేర్ చేసింది. వినోద్ (177*), రామ్‌చరణ్(133) సెంచరీలతో చెలరేగి జట్టుకు భారీ స్కోరును అందించారు. అనంతరం 167 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూ.గో.జట్టు 34 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయం చవిచూసింది. ప్రఖ్యాత్‌వర్మ 5, వినోద్ 2 వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించారు. తూ.గో. మొదటి ఇన్నింగ్స్: 259/9.

◆ కేవోఆర్ఎం మైదానంలో కడప, ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. చివరి రోజు మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 290/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. సాయికృష్ణచైతన్య 147★, హితేష్ సాయి 62★ పరుగులు చేయగా, దినేష్, లోకేష్ చెరో మూడు వికెట్లు తీశారు. ప్రకాశం మొదటి ఇన్నింగ్స్: 405/8

◆ కేఎస్ఆర్ఎం మైదానంలో చిత్తూరు, పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 132/3తో మొదటి ఇనింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన చిత్తూరు జట్టు 329/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప.గో జట్టు చివరి రోజు ఆట మగిసే సమయానికి 130/3 స్కోరు చేసింది. ప.గో.జట్టు మొదటి ఇన్నింగ్స్ సోర్కు 120.



వినోద్ (177 పరుగులు) | రామ్‌చరణ్ (133 పరుగులు) | ప్రఖ్యాత్ (5 వికెట్లు) | చైతన్య (147 పరుగులు)

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవో వెంకటసుబ్బయ్యకు చెక్కు అందజేస్తున్న రామాంజనేయరెడ్డి, కుటుంబ సభ్యులు

చక్రాయపేట, న్యూస్‌టుడే : గండిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన రామాంజనేయరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి రూ.1,00,116 చెక్కును మంగళవారం ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో అంజన్న దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ప్రజా ప్రతినిధి దాడి చేశారని ఎస్పీకి ఫిర్యాదు.!

కడప, న్యూస్‌టుడే: ఓ ప్రజాప్రతినిధి తనపై దాడి చేశారని ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 24న ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి ఎల్ఐసీ పాలసీ చేస్తామని, పట్టణంలోని గాంధీ బొమ్మ వద్దకు రావాలని చెప్పడంతో వెళ్లానని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో తనను కొందరు వ్యక్తులు ఓ ప్రజా ప్రతినిధి కార్యాలయానికి తీసుకెళ్లి దాడి చేశారని, ప్రజాప్రతినిధి కూడా చేయి చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ప్రొద్దుటూరు పోలీసులు విచారణ చేశారు. ప్రజాప్రతినిధి, మరికొందరు దాడి చేశారని వచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదని పోలీసులు తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు, పక్కన నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలయ్యే వరకూ 35 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. రామాంజనేయులు మాట్లాడుతూ 11వ పీఆర్సీలో జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని 12వ పీఆర్సీలో మెరుగైన ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, క్రిస్టోఫర్, ఆలమూరు ప్రసాద్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీబీఆర్‌కు జలకళ



పెంచికల బసిరెడ్డి జలాశయం (పీబీఆర్) కృష్ణాజలాలతో కళకళలాడుతోంది. సాగు, తాగునీటి అవసరాల మేరకు గండికోట ఎత్తిపోతల పథకాల 3 మోటార్ల ద్వారా జలాశయంలోకి ఆగస్టు 19 నుంచి 1400 క్యూసెక్కుల నీరు తరలిస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 7.11 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. లింగాల కుడికాలువ నుంచి గ్రావిటీ ద్వారా 190 క్యూసెక్కుల నీటిని ఎర్రబల్లె, నల్లచెరువుపల్లెకు తరలిస్తున్నారు. మరో మూడు రోజుల్లో వెలిదండ్ల, లింగాల, బోనాల ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులకు నీటిని తరలించనున్నారు. ఇప్పటికే కృష్ణాజలాలు, వరదనీటితో కామసముద్రం చెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఇక్కడి నుంచి పీబీసీ కాలువ ద్వారా పులివెందుల పురపాలక తాగునీటి అవసరాల కోసం నక్కలపల్లె సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నింపారు. అంకాళమ్మగూడురు, ఉలిమెళ్ల, వేముల కొత్తపల్లె, నల్లచెరువుపల్లె, ముసల్‌రెడ్డిపల్లె, గిడ్డంగివారిపల్లె, వెలమవారిపల్లె, తాళ్లపల్లె, కుప్పాలపల్లె, నందిపల్లె చెరువుల్లోకి నీటిని తరలిస్తున్నారు. **-న్యూస్‌టుడే, లింగాల**

పోలీసులు ఇస్తారా... కోర్టుకు అప్పగిస్తారా? / ఎటూ తేలని కార్ల వ్యవహారం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప తాలూకా ఠాణా పరిధిలో కొంతమంది కార్లను అద్దెకు తీసుకుని, వేరే చోట కుదువ పెట్టేసి యజమానులను మోసం చేశారు. దీనిపై ఎట్టకేలకు ఫిర్యాదు రావడంతో పోలీసులు రంగప్రవేశం చేసి 20 రోజుల కిందట 36 కార్లను స్వాధీనపరచుకున్నారు. వారం రోజుల కిందట ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వివరాలను వెల్లడించి, కార్లను మీడియాకు చూపించారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇప్పటివరకు వాటిని యజమానులకు ఇవ్వలేదు. దీంతో ప్రతి రోజూ వారు ఠాణా చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. చాలా మంది ఫైనాన్స్ ద్వారా కార్లను కొనుగోలు చేయడంతో ఓ వైపు కిస్తీల ఒత్తిళ్లు, మరో వైపు ఇల్లు గడవక అవస్థలు పడుతున్నారు. పోలీసులు కార్లను కోర్టుకు అప్పగిస్తారా లేదా బాధితులకు ఇస్తారా అనేది తెలియడం లేదు. పోలీసులు ఏదో ఒకటి తేల్చి చెప్పాలని యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పోలీసులు జప్తు చేసిన వాహనాలు

ఇబ్బందుల్లేకుండా హెచ్‌పీసీఎల్ పైపులైను నిర్మాణం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పర్యావరణానికి ఉపయుక్తంగా ఉండేలా, అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ హెచ్‌పీసీఎల్ పైపులైన్, కేబుల్ నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అనుబంధ శాఖలతో ఆయన మంగళవారం సమీక్షించారు. విజయవాడ - ధర్మపురి పైపులైన్ నిర్మాణం జిల్లాలో 140 కిలోమీటర్ల మేర జరుగుతుందని, ఇందుకు సంబంధించి ఆయా మండలాల్లో అన్ని రకాల అనుమతులు పొందాలన్నారు. ఏపీ ఫైబర్ నెట్, ఎయిర్ ఫైబర్ కేబుల్ నిర్మాణం జిల్లాలో 2400 కిలోమీటర్ల మేర చేపడుతున్నారని, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, హెచ్‌పీసీఎల్, నేషనల్ హైవే, ఏపీ ఫైబర్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేనేత సంఘాలకు నగదు జమ చేయాలని వినతి


జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నాబార్డు పథకంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు విడుదలైన డబ్బులను చేనేత సహకార సంఘాల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్‌కు చేనేత ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున వినతి పత్రం అందించారు. జిల్లాలోని 110 చేనేత సహకార సంఘాలకు 2020-21లో రుణం మంజూరైతే, 18 సంఘాలకు బకాయిల పేర జమ చేసుకున్నారని, మిగిలిన సంఘాలకు సంబంధించి ఇవ్వలేదన్నారు. తక్షణమే స్పందించి ఖాతాలకు జమ చేసేలా చూడాలని విన్నవించారు.

పర్యాటకం... ప్రజలకు మార్గదర్శకం

✦ యువత భవితకు కేంద్ర ప్రభుత్వం ఊతం ✦ ఉపాధి అవకాశాల మెరుగుకు చర్యలు

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

ప్రస్తుత పోటీ ప్రపంచంలో సరైన శిక్షణ, మార్గనిర్దేశం యువతకు చాలా అవసరం. డిగ్రీ పూర్తి చేసిన యువతీయువకులు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి చాలీచాలని జీతాలతో, కుటుంబానికి దూరంగా ఉంటూ ఎన్నో సమస్యలతో సతమతమవుతుంటారు. కానీ మనసుంటే మార్గం ఉంటుందని.. ఉద్యోగాల కోసం ఎక్కడికెళ్లకుండా చుట్టూ ఉండే పర్యాటక ప్రాంతాల్లోనే చక్కటి ఉపాధి పొందవచ్చని కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'పర్యాటక మిత్ర' కార్యక్రమంలో భాగంగా యువతకు ఐదు రోజుల పాటు ఉచిత గైడ్ శిక్షణ నిర్వహించారు. జిల్లాలో అత్యంత పర్యాటక ప్రాంతమంటే అందరికీ గుర్తొచ్చేది గండికోట. ఇటీవల కాలంలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంది. దేశవిదేశాల నుంచి కూడా పర్యాటకులు గండికోట అందాలను చూడటానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి యువతకు మన ప్రాంత సంప్రదాయాలు, విశిష్టతలు, ప్రాచీన కట్టడాల చరిత్ర, విశేషాలను పర్యాటకులకు తెలియజేస్తూ మార్గదర్శకులుగా నిలిచేందుకు ఐఐటీటీఎం నెల్లూరు కళాశాల నుంచి వచ్చిన డాక్టర్ శర్వానంద్, డాక్టర్ అభిలాష్ సుమారు 55 మందికి గైడ్ శిక్షణలో మెలకువలు నేర్పించారు.




శిక్షణ పొందిన యువతతో రాష్ట్ర పర్యాటకశాఖ ఏడీ లజ్వంతినాయుడు, అధికారులు

నైపుణ్యం సాధించాం



డిగ్రీ పూర్తి చేసి మన ప్రాంతంలోనే ఉంటూ గండికోటకు వచ్చే సందర్శకులకు ఇక్కడి విశిష్టతను తెలియజేస్తాను. ఎటువంటి భయంగా లేకుండా వారికి అర్థమయ్యేలా తెలియచేస్తా నన్న నమ్మకం కలిగింది. శిక్షణలో నైపుణ్యం సంపాదించాను. **-భాగ్యలక్ష్మి, బీఏ**

ఆర్థికంగా చేయూత



జమ్మలమడుగు ప్రాంతంలో పర్యాటక ప్రదేశాలు, దేవాలయాలు చాలా ఉన్నాయి. ప్రతి శని, ఆదివారం, సెలవు రోజుల్లో పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు పాఠశాల, కళాశాల విద్యార్థులు వస్తున్నారు. స్థానిక ప్రాధాన్యం చెప్పే వారు లేకపోవడంతో నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్తుంటారు. సందర్శకులకు అందుబాటులో ఉంటూ ఆర్థికంగా స్థిరపడతాను. **-రాఘవ, బీఏ**

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నేడు



సరస్వతి ఆలయం వద్దకు నీరు చేరకుండా ఏర్పాటు చేసిన మట్టికట్ట

కొండాపురం: కొండాపురం గ్రామంలోని శ్రీ సరస్వతి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఉప సర్పంచి విశ్వనాథరెడ్డి మంగళవారం తెలిపారు. 9వ తేదీ మూలా జన్మ నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్రావతినది ఒడ్డున ఆలయం ఉండడంతో ఈ నదిలో గండికోట వెనుక జలాలు ప్రవహిస్తుండంతో గుడి నీట మునగకుండా చుట్టూ మట్టికట్టలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలోకి చేరుతున్న నీటిని మోటార్లతో డీవాటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి వృథా... ఎవరికీ పట్టదా?



బద్వేలు మండలంలోని మడకలవారిపల్లె వద్ద తాగునీటి పైపులైన్ గత వారం రోజులుగా లీకేజీ అవుతుండటంతో కుళాయిలకు సక్రమంగా నీళ్లు రావడం లేదని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని పురపాలిక అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని లీకేజీని నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై పురపాలిక కమిషనర్ నరసింహారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మడకలవారిపల్లె వద్ద పైపులైన్ లీకేజీని అరికట్టి సక్రమంగా కుళాయిలకు నీళ్లు అందేలా చూస్తామన్నారు. - న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

స్పందనకు వందనం

ప్రొద్దుటూరు పట్టణం: స్థానిక మైదుకూరురోడ్డు శివాలయం సెంటర్ వద్ద ఉన్న ఓ లాడ్జి వద్ద ఉన్న మురుగు కాలువల్లో ఉన్న పూడికను ఆ వార్డు సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శి రాజేంద్రప్రసాద్ కార్మికులతో తీయించారు. ఈ సమస్యలపై ఇటీవల ప్రచురితమైన వార్తాంశంపై అధికారులు స్పందించారు.

?: ప్రొద్దుటూరు పట్టణం గంగమ్మవీధి జెండా చెట్టు పరిధిలోని వీధిలో ఉన్న మురుగు కాలువల్లో ఉన్న పూడికను సకాలంలో తొలగించడం లేదు. దీంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - జాఫర్, స్థానికుడు

✓: పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాను. - వంకం సుబ్బరాయుడు, ఒకటో డివిజన్, పారిశుద్ధ్య అధికారి

?: ప్రొద్దుటూరు పట్టణం గంగమ్మదేవాళంవీధి రామాలయం వద్ద ఉన్న మురుగుకాలువల్లో పూడికను తొలగించడం లేదు. దోమలకు నిలయంగా మారింది. - రాజేష్, స్థానిక వ్యాపారి

✓: మురుగుకాలువల్లో పూడికను తొలగించేందుకు సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం. - రవికుమార్, 22వ వార్డు సచివాలయ వార్డు పారిశుద్ధ్య కార్యదర్శి - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

?: నగర పంచాయతీ స్థలాలతోపాటు ప్రైవేటు స్థలాల్లో ముళ్ల కంపలు పెరిగి అపరిశుభ్రంగా తయారయ్యాయి, దోమలకు నిలయాలుగా మారాయి వీటిపై చర్యలు తీసుకోవాలి - నవీన్, జమ్మలమడుగు

✓: పట్టణంలో ప్రైవేటు స్థలాలు ఎక్కడ ఉన్నాయో గుర్తిస్తున్నాం. అపరిశుభ్రంగా ఉన్నచోట యజమానులకు నోటీసులు అందజేసి సమస్య పరిష్కరిస్తాం. - వెంకటరామిరెడ్డి, కమిషనర్, జమ్మలమడుగు

?: జమ్మలమడుగు సాయిరామ్ థియేటర్ వద్ద కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటిని తొలగిస్తే మురుగు పారేందుకు వీలుగా ఉంటుంది. - వలి, స్థానికుడు

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువలను శుభ్రం చేయించి మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం

?: పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో దోమలు ఎక్కువగా ఉన్నాయి. ఫాగింగ్ చేయించి దోమల బెడదను అరికట్టండి - శరత్‌కుమార్, స్థానికుడు

✓: వెంటనే భాగ్యనగర్ కాలనీలో ఫాగింగ్ చేయించి దోమల నివారణ చర్యలు తీసుకుంటాం

?: పట్టణంలో పెద్ద చెత్త డబ్బాలు ఉన్న చోట ఉదయమే వ్యర్థాలు తీసుకెళ్తే బాగుంటుంది. [illegible] - శ్రీను, స్థానికుడు

✓: పట్టణంలో మొత్తం 26 డస్ట్‌బిన్లు ఉన్నాయి. వాహనం ద్వారా తరలించడానికి సమయం పడుతుంది. ఇక నుంచి త్వరగా తీసుకెళ్లాలని సిబ్బందిని సూచిస్తాం.

?: భాగ్యనగర్ కాలనీలోని కొన్ని వీధుల్లో కాలువల్లో పూడిక తొలగించి చాలా రోజులు అవుతోంది, వ్యర్థాలు తొలగిస్తే మురుగు పారేందుకు సులువుగా ఉంటుంది. - నాగరాజు, స్థానికుడు

✓: ఎక్కడెక్కడ పూడిక తొలగించాలో గుర్తించి సమస్యను పరిష్కరిస్తాం. (పై ప్రశ్నలకు జమ్మలమడుగు నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ సమాధానం ఇచ్చారు) - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

వరాల తల్లీ... కటాక్షించమ్మా



ప్రొద్దుటూరు శ్రీకృష్ణాలయంలో పరశురామావతారంలో శ్రీకృష్ణుడు



మైదుకూరులో బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో పెద్దమ్మ దేవత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లో దసరా శోభ సంతరించుకుంది. అమ్మవారు భవానీదేవి, గజలక్ష్మి, మోహినీ, సంతానలక్ష్మీ దేవి, లక్ష్మీదేవి, గాయత్రీదేవి, భువనేశ్వరీదేవి, బాలాత్రిపుర సుందరీదేవి, శ్రీమహాలక్ష్మీదేవి, అన్నపూర్ణాదేవి తదితర రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్లకు మొక్కుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన, పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ పూజలు చేపట్టారు. జమ్మలమడుగు వీధుల్లో అవ్వాతాత, రాజురాణి భారీ బొమ్మల నృత్యాలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, క్లస్టరు బృందం



ప్రొద్దుటూరు మహాలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో సంతాన లక్ష్మీదేవి అలంకారం



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో ...



లక్ష్మీదేవి అలంకారంలో గాయత్రీదేవి



బద్వేలు అమ్మవారిశాలలో...



జమ్మలమడుగులోని అంబాభవానీ ఆలయంలో దర్శనానికి బారులు



దత్తాపురం ఆలయం వద్ద భక్తుల సందడి

మంటపంలో కొలువైన అమ్మవారికి పూజలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా సాధారణంగా ఆలయాల్లోని అమ్మవార్లను రోజుకో అలంకారం చేస్తుంటారు. జమ్మలమడుగు నీళ్లట్యాంకు వీధిలోని మసీదు వద్ద... దుర్గామాతను మంటపంలో ఏర్పాటు చేసి రోజు అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. కర్నూలు నుంచి ఎనిమిదిన్నర అడుగుల అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. విగ్రహం కోసం రూ.17 వేలు వెచ్చించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాల్లో మాదిరి రోజూ అమ్మవారికి అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం వేళల్లో కోలాటం, చెక్కభజన, పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి అబ్బిరెడ్డిస్వామి ఉత్సవాలు

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు క్రాస్‌రోడ్డులోని శ్రీ అవధూత అబ్బిరెడ్డిస్వామి దసరా ఉత్సవాలు బుధవారం నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆలయంలో ధ్వజ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహాసంకల్ప కార్యక్రమాలు వేదపండితులు చేపట్టనున్నారు. నిత్యం రాత్రి భజన బృందాలతో కార్యక్రమాల నిర్వహణ, ఆదివారం బండలాగుడు పోటీలు, నిత్యం అన్నదానాలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎమ్మెల్యేకు సత్కారం

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరులోని మరకత సహిత కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆర్యవైశ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పావనేని రాంబాబు, కాల్వరెడ్డి సంజీవరెడ్డి, లింగం పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన జడ్జి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలోని తిప్పలూరు గ్రామ సమీపంలో ఉన్న వృద్ధాశ్రమాన్ని మంగళవారం కమాలాపురం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ లావణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జీ ఆశ్రమంలోని వృద్ధుల యోగక్షేమాలపై ఆరా తీశారు. అనంతరం నిర్వహకులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది.



వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి లావణ్య

రైళ్లను పొడిగించాలని వినతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను తాడిపత్రి వరకు, ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను బెంగళూరుకు పొడిగించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తెలిపారు. ఈ విషయంపై ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టి కడప రైల్వే చీఫ్ ఎగ్జిక్యూటివ్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. గేయానంద్ మాట్లాడుతూ రాయలసీమ ప్రజలు ఎక్కువగా బెంగళూరుకు రాకపోకలు సాగించే విధంగా రైళ్లు ఏర్పాటు చేయాలన్నారు.




మాట్లాడుతున్న మాజీ శాసనమండలి సభ్యులు గేయానంద్, తదితరులు

నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

ముద్దనూరు, న్యూస్‌టుడే: గండికోట ప్రాజక్టు నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు విమర్శించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితుల సమస్యలపై గత ప్రభుత్వ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. నాయకులు బి.అన్వేష్, దస్తగిరిరెడ్డి, దాసు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్, విజయ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాల గుర్తింపునకు ఆదేశం

మైదుకూరు, న్యూస్‌టుడే : పురపాలకలో ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా ఆక్రమణకు గురై ఉంటే వారి వివరాలను సేకరించి వచ్చే సమావేశం నాటికి అందించాలని పేర్కొన్నారు. మంగళవారం పురపాలక ఛైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 45 మంది పారిశుద్ధ్య కార్మికులను మరో 5 నెలల కాలపరిమితిని పొడిగించాలని చేసిన ప్రతిపాదనకు ఎమ్మెల్యే స్పందించి 2 నెలలకే పరిమితం చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తే కూరగాయల మార్కెట్, మాంసం, చికెన్, చేపల వంటి దుకాణాలకు కేటాయిస్తే పురపాలకకు ఆదాయం వస్తుందన్నారు. పాత పురపాలక కార్యాలయ భవనాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయించకుండా పురపాలక అవసరాలతోపాటు వాణిజ్య దుకాణాలు నిర్మించడంతో ఆదాయం వస్తుందని సమావేశంలో ప్రస్తావించగా ఎమ్మెల్యే స్పందిస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయించినా బాడుగ వస్తుందని, దుకాణాలు నిర్మిస్తామని వివరణ ఇచ్చారు. పట్టణానికి వచ్చే 5 రహదారుల్లో పురపాలక స్వాగత పలకలు, ట్రాఫిక్ ఐలాండ్ ఆధునికీకరణ, కృష్ణదేవరాయలు, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్ విగ్రహాలు, కృష్ణదేవరాయులు కూడలిలో భారీ జాతీయ పతాకం ఏర్పాటు పనులను వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వేసవిలో తాగునీటి అవసరాల కోసం తీసుకున్న ప్రైవేట్‌బోర్లకు బాడుగ చెల్లించాలని వైస్ ఛైర్మన్ షరీఫ్ సమావేశం దృష్టికి తీసుకురాగా చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారి విశ్వకిరీటికి ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో కమిషనర్ ఎం. శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. ◆ పురపాలకలోని చెరువులకు నీరు నింపినందుకు కృతజ్ఞతగా పురపాలక సమావేశంలో తెదేపా వార్డు సభ్యులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు శాలువాకప్పి పూలమాల వేసి సత్కరించారు. అంతకముందు శెట్టివారిపల్లె, ఎల్లంపల్లె చెరువులు నింపినందుకు ఆప్రాంత రైతులు చేరుకుని ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, పక్కన ఛైర్మన్ చంద్ర, కమిషనర్ శ్రీనివాసులరెడ్డి

చెట్టు పడి నేలకూలిన విద్యుత్తు స్తంభం

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఖాజీపేట-రావులపల్లె రహదారిపై మంగళవారం ఉదయం చెట్టు విరిగి విద్యుత్తు తీగెలపై పడటంతో స్తంభం నేలకొరిగింది. దీంతో రావులపల్లె ఫీడర్‌లోని పిచ్చపాటిపల్లె, రావులపల్లె, హరిజనవాడ, కుమ్మరావులపల్లె గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో వ్యవసాయ మోటార్లు పనిచేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి సరఫరాను పునరుద్ధరించారు.

నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యమని ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా పర్యవేక్షణ అధికారి ఎస్.రమణ తెలిపారు. మంగళవారం ఆయన ఎర్రగుంట్ల విద్యుత్తు రెవెన్యూ కార్యాలయం, సబ్‌స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఏటా దాదాపు ఒకటి లేక రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుతున్నదని తెలిపారు. దీంతో విద్యుత్తు వినియోగం పెరుగుతుందన్నారు. జిల్లాలో 12.1 మిలియన్ యూనిట్లు విద్యుత్తు డిమాండ్ ఉన్నట్లు వివరించారు. త్వరలో ప్రీపెయిడ్ పద్ధతిలో స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈఈ రమణారెడ్డి. డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈఈ ప్రియదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో బద్వేలు విద్యార్థుల సత్తా

బద్వేలు, న్యూస్‌టుడే: ఓపెన్ నేషనల్ ఛాంపియన్ స్కూల్ గేమ్స్ అండ్ ఆక్టివిటీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-2024 దిల్లీలో ఈనెల ఐదు, ఆరు తేదీల్లో జరిగిన క్రీడా పోటీల్లో బద్వేలు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు క్రీడా ఉపాధ్యాయులు వెంకటనారాయణ తెలిపారు. మణికుమార్, భరణీకుమార్. సాయివిష్ణు, అరుణాచలం, శివనందిని బంగారు పతకాలు సాధించారు. విజేతలను బద్వేలు పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ క్రాంతికుమార్, ప్రిన్సిపల్ బాషా, క్రీడా ఉపాధ్యాయులు వెంకటనారాయణ అభినందించారు.



బంగారు పతకాలను సాధించిన బద్వేలు విద్యార్థులు

బద్వేలు గ్రామీణ: బద్వేలు మండల స్థాయిలో 8,9,10 తరగతుల విద్యార్థులకు శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో బద్వేలు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. లక్ష్మీపాళెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని సి.సునీత మొదటి, రాజుపాళెం యూపీ స్కూల్ విద్యార్థిని వి వైష్ణవికి ద్వితీయ, చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీకాంత్‌రెడ్డి తృతీయ బహుమతి అందుకున్నారు. వీరికి డీఈవో అనురాధ బహుమతి ఇచ్చి అభినందించారు.

రైతులతో ప్రయోగాలొద్దు

చాపాడు, న్యూస్‌టుడే: యూరియా కొరత వెంటాడుతోందని, ఏళ్లు గడుస్తున్నా విద్యుత్తు సమస్యలు తీరలేదని అన్నం పెట్టే రైతులతో ప్రయోగాలొద్దని మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు, సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చాపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పెద్దగురువలూరు సర్పంచి రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ యూరియా పంపిణీలో పెద్దలదే హవా సాగుతోందని, చిన్న, సన్నకారు రైతులకు అందడంలేదన్నారు. పట్టణాలకు వెళ్లి రైతులు మార్కెట్‌లో కొంటూ అవస్థలు పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ చలానా కట్టి ఏళ్లు గడుస్తున్నా సామగ్రి ఇవ్వలేదన్నారు. ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామానుజం, డీటీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం: గ్రామపంచాయతీల అభివృద్ధి అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో వెంగమునిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వీరనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. ఎండీయూ వాహనాలు మండలంలో కార్డుదారులకు ప్రతికార్డుకు 2 కిలోల బియ్యం తక్కువగా ఇస్తున్నారని ఎంపీటీసీలు తెలుపగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రామగోవిందరెడ్డి, మండల అధికారులు హాజరయ్యారు.

బహిరంగ ప్రకటన

మా కక్షిదారులైన కడప జిల్లా, ఖాజీపేట మండలం మరియు టౌన్, టీచర్స్ కాలనీ, డి.నెం. 4/326లో నివసించు లేట్ అంకిరెడ్డి పుల్లారెడ్డి గారి కూతురు అయిన అంకిరెడ్డి లక్ష్మమ్మ వీరి కుమారుడు అయిన అంకిరెడ్డి చెన్నారెడ్డి [illegible] ఈ నోటీసు షెడ్యూలు దాఖలాస్తి మా మొదటి కక్షిదారులైన ముదుమాల వెంకటసుబ్బయ్య అలియాస్ వెంకట సుబ్బయ్య గారికి చెందినది. [illegible] 1) తాడిపత్రి వెంకటసుబ్బమ్మ, 2) చిన్నరెడ్డి చిన్నక్క, 3) అంకిరెడ్డి లక్ష్మమ్మ (మొదటి కక్షిదారులు) [illegible] తప్పుడు దస్తావేజులు సృష్టించినారు. సదరు తప్పుడు దస్తావేజులు సృష్టించారు అని తెలుసుకొని మా కక్షిదారులు రెవెన్యూ వారికి, పోలీసు వారికి వివిధ ఫిర్యాదులు చేసినా ఉపయోగము లేనందున చివరగా మా కక్షిదారులు మహారాజ రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, ప్రొద్దుటూరు కోర్టు నందు ఈ నోటీసు దావా షెడ్యూలు దాఖలా ఆస్తిపై భాగము కోరుతూ O.S.No. 34/2023గా దావా దాఖలు చేసి మరియు ఈ నోటీసు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఈ కేసు తెగేంత వరకు ఎటువంటి క్రయ, విక్రయాలు జరుపరాదు అని కోరుతూ I.A.No. 638/2023, O.S.No. 34/2023 1) బొంత నారాయణమ్మ, 2) అట్లూరి రామలక్ష్మమ్మ, 3) బొంత భాగ్యమ్మ, 4) తాడిపత్రి హరినాథ్‌రెడ్డి, 5) తాడిపత్రి వెంకటసుబ్బారెడ్డి, 6) తాడిపత్రి రామకృష్ణారెడ్డి, 7) రామిరెడ్డి సరస్వతి, 8) చిన్నారెడ్డి సుబ్బమ్మ, 9) చిన్నిరెడ్డి రామచంద్రారెడ్డి, 10) ముమ్మడి లీలావతి, 11) పట్టుపోగుల ప్రదీప్, తండ్రి లేట్ వెంకట చలపతి (రంగాపురం గ్రామం, ఖాజీపేట మండలం) వారిపై దావా దాఖలు చేసి ఉన్నాము. కావున పై తెలిపిన వ్యక్తులతో ఈ నోటీసు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి క్రయ, విక్రయాలు జరుపరాదు అని, అట్లు జరిపినచో వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఇందుమూలంగా యావన్మందికీ ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు : ఐటమ్ నెం.1 : కడప జిల్లా, మైదుకూరు మండలం, సంద్యాలపేట గ్రామ పంచాయతీ జమీనులోని సర్వే నెంబరు 578 Ac 1.51 సెంట్లు ఇందులకు చెక్కుబంది : **తూర్పు :** చర్చికి సంబంధించిన స్థలము మరియు ఇతరుల జాగా, **పడమర :** 20 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం :** చిన్‌రెడ్డి రామసుబ్బమ్మకు చెందిన స్థలము, **దక్షిణము :** రోడ్డు. **ఐటమ్ నెం. 2 :** ఇదే గ్రామ పొలంలోని సర్వే నెంబరు 578, 629, 641/1 మరియు 724 పై సర్వే నెంబర్ల పైకి 2 ఎకరముల 29 సెంట్లు. **ఐటమ్ నెం.3 :** ఇదే పై తెలిపిన గ్రామ పొలంలోని సర్వే నెంబరు 469లోని Ac 1.08 సెంట్లు.

V.Ramamohan, K.Ramamohan, B.Akbar Ali Khan, Advocates, Kadapa.

లారీ డ్రైవర్ మృతిపై కేసు నమోదు

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మనగారిపాలెంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన డ్రైవర్ ఎలకల శ్రీకాంత్‌రెడ్డి (34) వాహనాన్ని తీసుకుని స్థానిక పరిశ్రమ నుంచి సిలికా తీసుకువెళ్లేందుకు వచ్చారు. ఈ క్రమంలో లారీలో విశ్రమిస్తూ గుండెపోటుతో మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక లారీ స్వాధీనం

గోపవరం, న్యూస్‌టుడే: బద్వేలు గ్రామీణ ఠాణా పరిధి పీపీకుంట చెక్‌పోస్టు వద్ద ఇసుక లారీని స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ సీఐ నాగభూషణ్ తెలిపారు. మంగళవారం మర్రిపాడు నుంచి ఎలాంటి బిల్లుల్లేకుండా ఇసుకను అక్రమంగా నంద్యాలకు తరలిస్తుండగా లారీని పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. లారీడ్రైవర్ రమణయ్య, యజమాని విక్రమ నరసింహారెడ్డిని అరెస్టు చేశామని సీఐ వివరించారు.

అక్రమ బదిలీలు రద్దు చేయాలి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: అక్రమ బదిలీలు చేసిన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఆ సంఘ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటర్‌మీడియట్ కళాశాలలో అక్రమ బదిలీలు జరిగాయన్నారు. ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పోరుమామిళ్ల కార్యవర్గం పాల్గొన్నారు.

ఖో-ఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నెల్లూరులోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సౌత్‌జోన్‌కు సంబంధించిన ఖో-ఖో పోటీల్లో భాగంగా అనంతపురంలోని జేఎన్‌టీయూ-ఎ వర్సిటీ జట్టులోకి తమ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సర బీటెక్‌లోని ఈసీఈ విద్యార్థులు సురేష్, ప్రశాంతి ఎంపికైనట్లు ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి మంగళవారం తెలిపారు. ప్రతిభాపాటవాలను ప్రదర్శించడంతో అర్హత సాధించిన విజేతలను సాయిరాజేశ్వరి విద్యా సంస్థల అధ్యక్షుడు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందనలు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.



విజేతలను అభినందిస్తున్న జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి


ఇంతి... స్వయం ప్రగతి

☛ పిల్లల ఉన్నతికి చేదోడుగా వ్యాపారాలు
☛ ఆర్థికంగా స్థిరపడుతున్న కుటుంబాలు

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు


పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా రుణాలు పొంది కొంత మంది మహిళలు చిరు వ్యాపారాలు చేసి కుటుంబానికి ఆసరా అయ్యారు. స్వయం ప్రగతి సాధిస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో 2,964 స్వయం సహాయ సంఘాలున్నాయి. 2023-24కు 1770 సంఘాలకు 253.69 కోట్లు రుణాలు ఇచ్చారు. 2024-25కు రూ.98.79 కోట్లు 1,500 సంఘాలకు ఇవ్వాలని లక్ష్యం ఉంటే, ఇప్పటికీ 274 సంఘాలకు రూ.42 కోట్లు ఇచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మహిళా వ్యాపారులకు మెప్మా బజారు ఏర్పాటు చక్కని వేదిక. దీన్ని గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు కూటమి సర్కారు ఆదేశాల మేరకు మెప్మా బజారు ఏర్పాటుతో వ్యాపారానికి, కుటుంబాభివృద్ధికి లోటు రాదని మహిళా వ్యాపారులు అంటున్నారు.

భర్త లేక.. ఉపాధి మార్గం బాట




ఈమె పేరు లక్ష్మీదేవి. ప్రొద్దుటూరు పట్టణంలోని గిడ్డంగివీధిలో మేము నివాసం ఉంటున్నారు. పదిహేడేళ్ల కిందట నుంచి బృందంలో చేరారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆమె భర్త మృతిచెందడంతో పిల్లల పోషణ, వారి చదువులకు ఆర్థిక స్వావలంబన సాధించడం తప్పనిసరి అయింది. డిగ్రీ చదివిన ఇద్దరు కుమారులకు ఉద్యోగాలు రాక ఆలయాల్లో పూజార్లుగా చేరారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు రుణం తీసుకుని చీరలతో పాటు పూజా సామగ్రి అమ్ముతున్నారు. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.20 వేలు మిగులుతున్నాయి.

అన్నీతానై జీవనానికి ఆధారం



ఈమె పేరు ఎన్.శివభారతి. మోడంపల్లిలో ఉంటున్నారు. ఈమె భర్త రాఘవరెడ్డి ఆటో డ్రైవర్ పనిచేసేవారు. ఆయన చనిపోయాక పిల్లల చదువు, కుటుంబ పోషణ కష్టమైంది. పదమూడేళ్ల కిందట బృందంలో చేరారు. ప్రభుత్వం నుంచి రుణం తీసుకుని గాజుల వ్యాపారం పెట్టారు. వ్యాపారవృద్ధికి మరో సారి రూ.2 లక్షలు తీసుకున్నారు. కుమారుడిని బీటెక్, కుమార్తెను డిగ్రీని చదివించారు. వారి ఉత్తమ భవిష్యత్తుకు కృషి చేస్తున్నారు.

కుటుంబానికి భరోసా



ఈమె పేరు అంజలిదేవి. ప్రొద్దుటూరులోని విజయనగరంవీధిలో నివాసం ఉన్నారు. భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబం ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు రుణం తీసుకున్నారు. మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీతో తీసుకున్న రుణంతో వ్యాపారం పెట్టారు. రోజువారీ వినియోగానికి దోహదపడే ఆహారపదార్థాలను విక్రయశాలను ఏర్పాటు చేశారు.

అంతర్జాల సదుపాయం కల్పించేందుకు చర్యలు



ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఏవోలతో మాట్లాడుతున్న సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణ

వేంపల్లె, న్యూస్‌టుడే : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలోని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల విద్యార్థులు ఇంటర్‌నెట్ లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి తెలిపారు. ఆయన సూచనల మేరకు రాజమండ్రికి చెందిన హైస్పీడ్ ఇంటర్నెట్ ప్రొవైడర్ సత్యనారాయణ, వేంపల్లె ఎంపీటీసీ మాజీసభ్యుడు జీవీ రమణ మంగళవారం ట్రిపుల్‌ఐటీకి వెళ్లి డైరెక్టర్ కుమారస్వామిగుప్త, ఏవో రవికుమార్‌తో చర్చించారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ఒకే చోట అన్ని సేవలు

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న మహిళలకు అన్ని సేవలు కడపలోని రిమ్స్ ఆవరణలోని వన్ స్టాప్ సెంటర్‌లో అందుబాటులో ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తెలిపారు. ఆయన మంగళవారం వన్ స్టాప్ సెంటర్‌ను పరిశీలించి సూచనలు చేశారు. చట్టపరమైన సలహాలు, పోలీసు, వైద్య సహాయంతో పాటు, తాత్కాలిక ఆశ్రయం ఇక్కడ పొందవచ్చన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానాన్ని వివరించారు.



వన్ స్టాప్ సెంటర్‌లో దస్త్రాలు పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

మేమున్నాం... మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: సిద్దవటం దిగువపేటలోని ప్రధాన బస్టాప్ వద్ద కల్వర్టు రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది.
- సుబ్బయ్య, శివప్రసాద్, సిద్దవటం మండలం

✔ : పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.
- గంగిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ - న్యూస్‌టుడే, సిద్దవటం

?: నగరంలోని కోఆపరేటివ్ కాలనీ విద్యామందిర్ సమీపంలోని ప్రధాన రహదారిలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. **- వంశీ కృష్ణ**

✔ : సిబ్బందిని పంపి చెత్తకుప్పలను తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప** - న్యూస్‌టుడే, బిల్టప్

?: మా పెన్నపేరూరు గ్రామంలో ప్రధాన రహదారి పక్కన చెత్త వేస్తున్నారు. **- సుబ్బరాయుడు, పెన్నపేరూరు**

✔ : రహదారి పక్కనే ఉన్న చెత్తను వెంటనే తొలగిస్తాం. పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. **- భావన, బాధ్య కార్యదర్శి**

?: మా గ్రామంలో ఎల్‌ఈడీ వీధి దీపాలు పట్టపగలూ కూడా వెలుగుతూనే ఉన్నాయి. **- వెంకటసుబ్బమ్మ, దర్జిపల్లి**

✔ : సమస్యను ఎస్పీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తాం. **- భావన, కార్యదర్శి, గొల్లపల్లి**

?: ఒంటిమిట్ట ఈఆర్వో కార్యాలయంలో విద్యుత్తు బిల్లులు చెల్లిస్తే, సిబ్బంది చేత్తో బిల్లు రాసిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ముద్రణ బిల్లు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. **- సుబ్బరామయ్య, ఒంటిమిట్ట**

✔ : పరికరానికి తక్షణమే మరమ్మతులు చేయిస్తాం. కంప్యూటర్ బిల్లు ఇస్తాం. **- రమణ, ఎస్ఈ** - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

?: ఏపీజీ బ్యాంకు పక్క వీధిలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళ అంధకారం నెలకొంది. **- ఉమాదేవి సింహాద్రిపురం**

✔ : సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరిస్తాం.
- ఈవో వెంకటరాముడు - న్యూస్‌టుడే, సింహాద్రిపురం

?: జడ్పీ ఉన్నత పాఠశాల వెనుక వీధిలో మురుగు రోడ్డుపైకి వస్తోంది నడిచేందుకు ఇబ్బందిగా మారింది. **- చాంద్‌బీ**

✔ : కాలువలు శుభ్రం చేయించి, సమస్యను పరిష్కరిస్తాం.
- ఈవోపీఆర్‌డీ పద్మనాభరెడ్డి - న్యూస్‌టుడే, సింహాద్రిపురం

?: పట్టణంలోని శివాలయానికి వెళ్లే దారి పక్కనున్న కుళాయి చుట్టూ మురుగు చేరింది. **- రాజేశ్, కమలాపురం**

✔ : సిబ్బందిని పంపించి మురుగు తొలగిస్తాం.

?: పట్టణంలోని సంబటూరు బస్టాండు నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారిలో చెత్తకుండీ నిండి దుర్వాసన వస్తోంది.
- మస్తాన్‌వల్లి, స్థానికుడు, కమలాపురం

✔ : పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగిస్తాం.
- బాలనరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, కమలాపురం

?: పెండ్లిమర్రి గ్రామ సచివాలయం భవనం వెనుక వైపు పిచ్చిమొక్కలు అపరిశుభ్రంగా ఉన్నాయి. **- మల్లారెడ్డి, స్థానికుడు.**

✔ : పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయిస్తాం.
- లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, పెండ్లిమర్రి

మూడో కంట్లో నలుసు
పనిచేయని సీసీ కెమెరాలు



పులివెందులలో నేలకూలిన సీసీ కెమెరా స్తంభం

పులివెందుల (లింగాల), న్యూస్‌టుడే : పులివెందుల నియోజకవర్గంలో చోరీల నివారణ, ట్రాఫిక్, అల్లర్లు నియంత్రించేందుకు ప్రధాన కూడళ్లు, రహదారులపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పర్యవేక్షణ లోపంతో ఏళ్ల తరబడి పనిచేయడం లేదు. కూడళ్ల వద్ద కెమెరాలు మరమ్మతులకు గురైనా పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు, చోరీలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారుతోంది. మూడేళ్ల కిందట రూ. లక్షలు వెచ్చించి పులివెందులలోని కోతిసమాధి దేవి ఎలక్ట్రానిక్స్, ముద్దనూరు, కడప రింగు రోడ్డు ప్రవేశమార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటికి ఫైబర్ నెట్ ద్వారా కనెక్షన్ ఇచ్చి విజయవాడ కంట్రోలు రూం ద్వారా పర్యవేక్షిస్తూ ఇక్కడి పోలీసులకు దిశానిర్దేశం చేయాల్సి ఉంది. కెమెరాలు అమర్చి మూడేళ్లవుతున్నా ప్రారంభించకపోవడంతో పనికి రాకుండా పోతున్నాయి. దేవి ఎలక్ట్రానిక్స్ దుకాణం వద్ద స్తంభానికి ఏర్పాటు చేసిన కెమెరాలు కనిపించడం లేదు. మరో స్తంభాన్ని వాహనం ఢీకొట్టడంతో నేలకొరిగింది. పార్నపల్లె బస్టాండు వద్ద ఇటీవల ఓ వ్యాపారి జేబు కత్తిరించి రూ. లక్ష దొంగలించారు. ఇక్కడ పదుల సంఖ్యలో చోరీలు జరిగినా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. నెల రోజుల కిందట వేంపల్లెకు చెందిన మహిళ తాడిపత్రికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా సంచి నుంచి నగదు దొంగిలించారు.

● సింహాద్రిపురం బస్టాండు, తితిదే కల్యాణ మండపం వద్ద నాలుగేళ్లుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. లింగాల మండల పరిధిలోని పార్నపల్లె, వెలిదండ్ల, లింగాల, చిన్నకుడాల, ఇప్పట్ల, అంబకపల్లె ఘాట్‌రోడ్డు సమీపంలో కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయి. నాలుగు రోజుల కిందట పందుల ముఠా తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులపై రాళ్లురువ్వారు. సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే దొంగల కదలికలు కెమెరాల్లో నిక్షిప్తం అయ్యేవి. సీసీ కెమెరాలు పనిచేస్తే దాడితోట, పార్నపల్లె, తురకవారిపల్లె, లక్ష్ముంపల్లె నదుల నుంచి రాత్రివేళ తరలించే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్టపడుతుంది. ఈ విషయమై పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ స్పందిస్తూ పులివెందుల నియోజకవర్గంలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని గుర్తించి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులకు నిపుణులను పిలిపించాం. నిధులు రూ. 45 లక్షలు అవసరమని చెప్పారు. మరో 50 సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించామన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



కార్మికులకు సూచలిస్తున్న అదనపు కమిషనర్

బిల్టప్ కడప న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగు పరచటానికి అధికారులు ప్రణాళిక రూపొందించాలని అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం సూచించారు. ఆయన మంగళవారం నగరంలోని రాధాకృష్ణ నగర్, శంకరాపురం, అశోక్‌నగర్, సంజన సర్కిల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. చెత్త సేకరణలో జాప్యం చేయొద్దని, రోడ్లు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.

శిల్పారామంలో దసరా సంబరాలు

పులివెందుల (వేంపల్లె) : పులివెందుల శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లో ఈ నెల 11 నుంచి దసరా ప్రత్యేక సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గోడపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 11, 12, 13 తేదీల్లో సాయంత్రం 5.30 నుంచి 8 గంటల వరకు నృత్య ప్రదర్శనలు, కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

హెచ్చరిక ఫలకం తొలగించి ఆక్రమణకు యత్నం

సిద్దవటం, న్యూస్‌టుడే: మండలంలోని కనుమలోపల్లిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు నాటిన హెచ్చరిక ఫలకాన్ని ఆక్రమణదారు తొలగించి పనులు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. సిద్దవటం మండలం కనుమలోపల్లిలోని కడప-చెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వే సంఖ్య 70/3లో 70 సెంట్ల ప్రభుత్వ భూమి ఉండేది. కడపకు చెందిన ఓ వ్యక్తి గతంలో ఆ భూమిని కబ్జా చేసి యంత్రాలతో చదును చేసి గుడి పేరుతో నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు అడ్డుకుని హెచ్చరిక ఫలకం నాటారు. దానిని మంగళవారం ఆ వ్యక్తి తొలగించి, పక్కన పడేసి మళ్లీ నిర్మాణ పనులు కొనసాగించాడు. ఈ సమాచారం తెలుసుకున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలు ఘటనా స్థలానికి వెళ్లి యథా స్థానంలో బోర్డు ఏర్పాటు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని వీఆర్‌వో శ్యాంబాబు హెచ్చరించారు.

అధిక దిగుబడులు సాధించేలా సూచనలివ్వాలి

కమలాపురం, న్యూస్‌టుడే: అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెప్పలిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్ యంత్రాన్ని పరిశీలించారు. తరువాత రైతు సేవా కేంద్రం వద్ద రాయితీపై శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతలు కూడా వ్యవసాయాధికారుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సేంద్రియ పద్ధతులు పాటించాలని చెప్పారు. తక్కువ ఖర్చుతో పురుగు మందులు పిచికారీ చేసుకునేందుకు యాంత్రీకరణ ద్వారా డ్రోన్‌ను ఉపయోగించుకోవాలన్నారు. గ్రామంలో సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని చెప్పారు. ఏడీఏ నరసింహారెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ మాధురి, ఉద్యానవనశాఖాధికారి రెడ్డెయ్య, ఏవో సరస్వతి, పశువైద్యాధికారి శివజ్యోతి, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, నాయకులు రాఘవరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పుత్తా ఎల్లారెడ్డి, నాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, అధికారులు

యువకుడిపై దాడి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప తాలూకా ఠాణా పరిధిలో యువకుడిపై మరో యువకుడు దాడి చేశాడు. కడప అక్కాయపల్లెకు చెందిన ఇస్మాయిల్ అదే ప్రాంతానికి చెందిన దీపక్‌లు ఈ నెల 6న డీఎంహెచ్‌వో కార్యాలయం సమీపంలో గొడవ పడ్డారు. ఇస్మాయిల్‌పై దీపక్ దాడి చేసి గాయపరిచాడు. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగ : కడప చిన్న చౌకు ఠాణా పరిధిలో నివాసాల్లో చోరీకి పాల్పడిన ఓ యువకుడిని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఇతను పట్టపగలు ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించారు. పూర్తివివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

213 మద్యం సీసాలు స్వాధీనం

లింగాల, న్యూస్‌టుడే : అంబకపల్లెలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న చుక్కలూరు ప్రభాకరరెడ్డి, కొమ్మాశివారెడ్డిలను అదుపులోకి తీసుకొని 213 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల గ్రామీణ సీఐ ఎన్‌వీ రమణ తెలిపారు.

ఘనంగా పుత్తా జన్మదిన వేడుకలు



పుత్తా నరసింహారెడ్డిని సన్మానిస్తున్న తెదేపా నాయకులు

కమలాపురం : తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన స్వగ్రామం వల్లూరు మండలం, మాచిరెడ్డిపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

జిల్లా పేరు మారిస్తే ఊరుకోం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: జిల్లా పేరును మారిస్తే ఊరుకోబోమని వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అందరి ఆమోదంతో జిల్లాకు వైఎస్ఆర్ పేరు పెట్టారని చెప్పారు. ఇప్పుడు పేరు మార్చాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కోరడం విడ్డూరంగా ఉందని, వేరే జిల్లాకు చెందిన ఆయనకు ఇక్కడి పేరు మార్పుతో పనేంటని ప్రశ్నించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మంత్రికి వంత పాడడం సరికాదన్నారు.

ప్రలోభాలతోనే పార్టీ మారారు ; కమలాపురం నగర పంచాయతీ ఛైర్మన్, కౌన్సిలర్లు తెదేపాలో చేరడంపై రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ అధికారపార్టీ ప్రలోభాలకు గురైన వారు, వివిధ రకాల పనులు చేసి బిల్లులు రావాల్సిన వారు వైకాపాను వీడారన్నారు. దీని వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని, వారి స్థానంలో కొత్త నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకుంటామని చెప్పారు. పులి సునీల్‌కుమార్, పాకా సురేష్, బాలస్వామిరెడ్డి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు

వేముల, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని, ఆ దిశగా రైతులు ముందుకెళ్లాలని ఏవో చెన్నారెడ్డి తెలిపారు. భూమయ్యగారిపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలని వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గంగపేరూరు, మలకాటిపల్లెలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, పుష్పకుమారి, పద్మజ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : రైతులు సేంద్రియ ఎరువుల వాడకంతో సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రసూల్‌పల్లె గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి పసుపు పంటలను పరిశీలించారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే తెదేపాలోకి కౌన్సిలర్లు

కమలాపురం, న్యూస్‌టుడే : వైకాపాకు చెందిన నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మేరితో పాటు మరో నలుగురు మహిళా కౌన్సిలర్లు తెదేపాలోకి చేరడం కేవలం వారి స్వలాభం కోసమే తప్ప మరొకటి కాదని నగర పంచాయతీ ఉప ఛైర్మన్లు శ్రీనివాసులరెడ్డి, సాధిక్ పేర్కొన్నారు. వారు మంగళవారం స్థానిక వైకాపా కార్యాలయంలో మాట్లాడుతూ వారు పార్టీ మారడం వల్ల వైకాపాకు వచ్చిన నష్టమేమీ లేదని చెప్పారు. నాయకులు బాలగంగాధర్‌రెడ్డి, దేవదానం, సంధ్యారాణి, కొండారెడ్డి, జెట్టి నాగేశ్, జిలానీ బాషా, జాహిద్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కడప నగర కమిటీ ఎన్నిక



కరీముల్లా, అధ్యక్షుడు



హిఫాజతుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి

కడప విద్య, న్యూస్‌టుడే : యూటీఎఫ్ కడప నగర నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా లింగారెడ్డి, అధ్యక్షుడిగా కరీముల్లా, ప్రధాన కార్యదర్శిగా హిఫాజతుల్లా, సహాధ్యక్షులుగా బాలభాస్కర్, పుష్పకుమారి, కోశాధికారిగా మేరీప్రసన్న, జిల్లా కౌన్సిలర్లుగా కరీముల్లా, రూతు ఆరోగ్యమేరీ, మోహనరావు, మండల కార్యదర్శులుగా షేక్ మొహమ్మద్ ఆసిఫ్, మరియరాణి, రెడ్డి లక్ష్మీప్రసన్న, మృదుల, గంగరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్ గా డేవిడ్ వినయ్‌కుమార్, సభ్యులుగా సుమతి, ఆసిఫ్‌అహ్మద్ తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రభాకర్, శ్రీనివాసులు వ్యవహరించారు.

మహాలక్ష్మీ... పాహిమాం



దేవుని కడపలో కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి



సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీవైకుంఠనాథ అలంకరణ

దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఆయా చోట్ల ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయి. - న్యూస్‌టుడే, బృందం



యర్రముక్కపల్లెలోని చౌడమ్మ ఆలయంలో...



వేంపల్లెలో మోహినీదేవీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి



శంకరాపురం ఎస్‌బీఐ వెనుక వీధిలో...



వేములలో గజలక్ష్మి దేవి అలంకరణలో



రవీంద్రనగర్‌లోని రామాంజనేయస్వామి ఆలయంలో



సిద్దవటం మాధవరం-1లో గజలక్ష్మిగా దుర్గాదేవి



ఆకులవీధిలో మంగళగౌరి అలంకరణలో రాజరాజేశ్వరిదేవి



ఒంటిమిట్ట కన్యకాపరమేశ్వరి ఆలయంలో త్రిపురసుందరీదేవిగా



కమలాపురం : వైష్ణవీ దేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు 'జనంకోసం బైక్ సర్వీస్ పాయింట్'లోని 20 రోజుల పాటు మోటార్ మెకానిజంలో ఉచిత శిక్షణ ఇస్తామని సర్వీస్ సెంటర్ యజమాని ఖాదర్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐటీఐ చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తిగలవారు కడప బళ్లారిరోడ్డులోని మేకలదొడ్డిలో సర్వీస్‌పాయింట్‌లో సంప్రదించాలని సూచించారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై అపోహలు వీడాలి

సిద్దవటం, న్యూస్‌టుడే : ప్రభుత్వ నిబంధనల మేరకే నూతన మద్యం దుకాణాల ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై ఎలాంటి అపోహలకు తావులేదని జిల్లా ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంటు అసిస్టెంట్ సూపరింటెంటెంట్ ఎం.రవి తెలిపారు. సిద్దవటంలోని ఆ శాఖ కార్యాలయంలో మంగళవారం మద్యం దుకాణాల ఏర్పాటుపై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సిద్దవటం, ఒంటిమిట్ట, అట్లూరు మండలాల పరిధిలో ఎనిమిది దుకాణాలకు ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిద్దవటం సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అసిస్టెంటు సూపరింటెండెంట్ రవి

ఎన్‌సీసీతో విద్యార్థులకు ప్రయోజనం



మాట్లాడుతున్న 30 ఆంధ్రా బెటాలియన్ సీవో కల్నల్ సూర్యనారాయణ

కడప క్రీడలు : ఎన్‌సీసీ శిక్షణ తీసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని 30 ఆంధ్రా బెటాలియన్ సీవో కల్నల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఎన్‌సీసీ నగర్‌లో జరుగుతున్న 8వ కంబైన్డ్ వార్షిక శిక్షణా శిబిరం మంగళవారం ప్రారంభమైన సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లను పొంది, ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పులివెందుల (వేంపల్లె),న్యూస్‌టుడే : గ్రామాల్లో దోమల లార్వాను గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బందికి మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య టార్చిలైట్లు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్, లార్వా సర్వే చేపట్టాలన్నారు.

చట్టానికి లోబడి సమాచారాన్ని ఇవ్వండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టానికి లోబడి దరఖాస్తుదారులు అడిగిన వివరాలను నిర్ణీత గడువులోపు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీ, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందికి సహ చట్టంపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో సోమశేఖర్ పాల్గొన్నారు.